చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అంబీర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , సెప్టెంబర్ 3 : భవిష్యత్ తరాలకు వనరులను అందించే చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. వాటిని పూర్తి స్థాయిలో పరిరక్షించుకోవటం ద్వారా ముంపు ముప్పుకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హైదర్‌నగర్ డివిజన్ ప్రగతి నగర్ అంబీర్ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన చెరువు స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, మురుగు నీరు కలవకుండా ప్రత్యేక డైవర్షన్ ఛానళ్ల ఏర్పాట్లు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఆహ్లాదాన్ని పంచేలా పచ్చదనం ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దోమల వ్యాప్తికి కారణమవుతున్న గుర్రపు డెక్క తొలగింపును ఎప్పటికపుడు చేపడుతూ ఆయిల్ బాల్స్ సహా ఇతర నివారణ చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. నియోజకవర్గంలోని చెరువులను సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల సైబర్ ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యల పరిష్కారంతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీ వాసులు ఎమ్మెల్యే గాంధీని మంగళవారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ త్వరలో కాలనీలో ప్రజలతో కలిసి పర్యటిస్తానని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతానన్నారు. కాలనీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు.

వినాయక ప్రతిమలు అందజేత..

హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలను ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి వేడుకలకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని, పర్యావరణాన్ని కాపాడుతూ భక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు.

మట్టి విగ్రహాలను అందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తున్నాం

కార్పొరేటర్ రోజాదేవి

మియాపూర్ , సెప్టెంబరు 3 : వరద ప్రభావానికి గురైన ప్రజలను ఆదుకోవటం చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వంతో యావత్ ఖమ్మం జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు నష్టానికి గురయ్యారని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. బాధల్లో ఉన్న ప్రజలను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడులతో గులాబీ శ్రేణులను భయపెట్ట లేరని, కష్టాలలో ఉన్న ప్రజలకు గులాబీ జెండా ఎప్పటికీ అండగా నిలుస్తుందని రోజాదేవి స్పష్టం చేశారు.

ఆర్థిక సాయం అందించాలి

అల్లాపూర్,సెప్టెంబర్ 3: సీఎం రేవంత్‌రెడ్డి ఖ మ్మంలో వరద ముంపు బాధితులకు ప్రకటించిన రూ.10 వేల ఆర్థిక సహాయం అల్లాపూర్ డివిజన్ పరిధిలో ముంపు గురైన సప్థార్‌నగర్,రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో కూడా అందించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ ను మంగళవారం ఆయన కార్యాయలంలో కార్పొరేటర్ సబీహాబేగం కలిసి వినతి పత్రం అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. జీడిమెట్ల సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం...పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దేవి శైలజ , సతీష్ (36) భార్యాభర్తలు. మారుతీనగర్ లో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా సతీశ్ వరుసకు చెల్లెలు దివ్య అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని షాపూర్‌నగర్ ఎన్ఎల్‌బీనగర్ లో ఓ అద్దె ఇంట్లో కలిసి ఉంటున్నాడు. దీంతో భార్యతో నిత్యం గొడవ పడుతుండడంతో విసుగు చెందిన సతీశ్ మంగళ వారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక వేడుకలకు ఏర్పాట్లు

మియాపూర్: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో వినాయక వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సమతానగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

సమావేశంలో పాల్గొన్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి,కమిషనర్ సౌజన్య

దుండిగల్,సెప్టెంబర్3: వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి సూచించారు. ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పలు విభాగాలకు చెందిన అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు, పెండింగ్ దశలో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు,అవసరమైన మౌలిక సదుపాయాల పనులు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో రోడ్లు,డ్రైనేజీ,ఎస్ఎన్‌డీపీ నాలా వ్యవస్థ ను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, విద్యుత్ తీగలు, స్తంభాల నిర్వహణపై దృష్టిసారించాలని సూచించారు. వరద, మురుగు నీటి తొలగింపు చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, పురాతన నిర్మాణ సముదాయాలపై జాగ్రత్త వహించేలా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటివి వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనం చేసే చెరువుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు వంటి పలు కీలక అంశాలపై ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ సౌజన్య,మేనేజర్ పవన్‌కుమార్,కార్పొరేటర్లు చిట్ల దివాకర్,రాజేశ్వరీ,కో-ఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్‌ముదిరాజ్,మున్సిపాలిటీకి చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి,కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్,సెప్టెంబర్3: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌తో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మంగళవారం పర్యటించారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు సప్థార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ లో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు.అధికారులు అప్రమత్తంగా ఉండాలని,ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని ఆమ్రపాలి సూచించారు.భవిష్యత్తులో వరద ముంపు సమస్య తలెత్తకుండా, ఎగువనున్న సున్నం చెరువు,కాముని చెరువు నుంచి దిగువ మైసమ్మ చెరవులోకి వచ్చే వరద నీటి కాలువను విశాలంగా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం,మూసాపేట సర్కిల్-23 ఉపకమిషనర్ రమేశ్, ఇంజినీరింగ్ డీఈ ఆనంద్,ఏఈ రంజిత్,టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 3 : రంగధాముని చెరువు గట్టుపై వినాయక నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, వేడుకలు ప్రశాంతంగా జరుపుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి అన్నారు. మంగళవారం మూసాపేట సర్కిల్‌లోని కూకట్‌పల్లి రంగధాముని(ఐడీఎల్) చెరువు గట్టుపై వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు గట్టుపై నున్న కొలనును పరిశుభ్రంగా మార్చాలని, రంగులు వేయాలని సూచించారు. చెరువులో వ్యర్థాలను తొలగించాలన్నారు. చిన్న విగ్రహాలను కొలనులోనే నిమజ్జనం చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలోని ఆయా చెరువులలో నిమజ్జన ఘట్టానికి అన్ని రకలా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం చేయడానికి విగ్రహాలతో చెరువు గట్టుపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్సీ అపూర్వ్ చౌహాన్, ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీ రమేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈలు రంజిత్, శ్రీనివాస్ ఉన్నారు.

సభ్యత్వ నమోదుపై డ్రైవ్

జీడిమెట్ల, సెప్టెంబర్ 3 : బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు వాసు అన్నారు. మంగళవారం సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌నాయక్ నగర్‌లో బీజేపీ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు

ఇల్లు కూలిన బాధితురాలికి నిత్యావసరాలు అందజేత

నిత్యావసర సరుకులు అందజేస్తున్న సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గణేశ్

దుండిగల్,సెప్టెంబర్3: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన తమ్మల్లి బాలమణికి చెందిన ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు,దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేశ్ మంగళవారం బాధితురాలిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. నాయకులు అమరం ముత్యంరెడ్డి,తలారి రాజు ముదిరాజు,వాపుల శ్రీనివాస్,శిరగల్ల బాబు, మూసాపేట్ రమేశ్, సందనబోయిన వెంకటేశ్, పండగ శివ,నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌కు... కొత్త రోడ్డును ఏర్పాటు చేయాలి

ప్రతిపాదించిన రోడ్డును పరిశీలిస్తున్న న్యాయవాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 3 : కూకట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్‌కు ప్రస్తుతం ఉన్నటువంటి రోడ్డు మార్గంతో న్యాయవాదులు, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని...కొత్త రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు కోరుతున్నారు. మంగళవారం బాలాజీనగర్ డివిజన్‌లోని అంబేద్కర్ కాలనీ పక్కన ఇటీవల కొలువుదీరిన కోర్టు కాంప్లెక్స్ భవనం రోడ్డు సమస్యను, కొత్త మార్గం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని బార్ అసోసియేషన్ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి కోర్టు భవనానికి సరైన రోడ్డు మార్గం లేదని, ప్రతిరోజు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యలను జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులకు విన్నవించగా.. కొత్త రోడ్డును ప్రతిపాదించడం జరిగిందని, ఈ పనులను త్వరగా పూర్తిచేసేందుకు ఆయా విభాగాల అధికారులు కృషిచేయాలని కోరారు.

స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్

హ్యాకథాన్‌లో పాల్గొన్న ఎంఎల్ఆర్ఐటీ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు

దుండిగల్,సెప్టెంబర్3: దుండిగల్‌లోని మల్రిలక్ష్మన్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో మంగళవారం సెంటర్ ఫర్ ఇన్నోవేషన అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడా ఘర్వాలటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు మనోజ్ అగర్వాల్, ఆకాశ్‌రావుతో పాటు సీనియర్ ప్రాజెక్ట్ విశ్లేషకుడు మల్లారెడ్డి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులకు వారి ప్రతిభను,వ్యవస్థాపక ఆలోచనలను ప్రదర్శించడానికి ఇది ఒక చక్కని వేదికగా ఉపయోగపడుతుందన్నారు.తద్వార తమ సృజనాత్మకత ఆవిష్కరణలు,వ్యాపార చతురతను చాటుకనేందుకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.అనంతరం ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రటరీ మల్కాజ్‌గిరి శాసనసభ్యుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఎప్పుడూ సహకరిస్తుందని స్పష్టం చేశారు. అధ్యాపకుల సహకారంతో విద్యార్థులు సమన్వయంతో కృషి చేసి ఈ హకథాన్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా,కే.శ్రీనివాసరావు,కో-ఆర్డినేటర్ డా.బలరాం తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కమిషనర్‌గా సౌజన్య

దుండిగల్,సెప్టెంబర్3: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా నియమితులైన సౌజన్య బాధ్యతలు స్వీకరించారు.

చిన్నారులు ఆడుకుంటూ నేర్చుకునేలా చూడాలి

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతం

దుండిగల్,సెప్టెంబర్3: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ఆడుకుంటూ నేర్చుకునేలా పజిల్ గేమ్స్, ఆటలు ఉండేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతం అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. మంగళవారం దుండిగల్,బహదూర్ పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా అంగన్‌వాడీలను పరిశీలించి ఎంత మంది పిల్లలు ఉన్నారు, వారికి ఎంత వయసు, బరువు సరిగ్గానే ఉన్నారా..? అంటూ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు.బలహీనంగా ఉన్న పిల్లల బరువు చూసి వారికి పౌష్టికాహారంతోపాటు దగ్గరగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించి,అవసరమైన మందులు అందించాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు అందించే ఆహారం,గుడ్లు ఆయన పరీక్షించారు. మెనూ ప్రకారం పిల్లలకు పరిశుభ్రమైన,రుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు కలెక్టర్‌కు పువ్వులు అందించి రైమ్స్ పాడి వినిపించారు. ఈ పర్యటనలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సీడీపీవో శారద,గండి మైసమ్మ మండల స్పెషల్ ఆఫీసర్ బాబు మోసెస్, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, దుండిగల్ అంగన్‌వాడీ ఇన్‌చార్జి శోభారాణితో పాటు పలువురు సూపర్‌వైజర్లు,టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో డిజిటల్ పరివర్తన కొనసాగుతుంది

కార్యక్రమంలో పాల్గొన్న సమున్నతి డైరెక్టర్ ప్రవేశ్ శర్మ

మాదాపూర్, సెప్టెంబర్ 3: వ్యవసాయంలో డిజిటల్ పరివర్తన కొనసాగుతుందని, దీనికి కేంద్రబిందువుగా భారత్ ఎఫ్‌పీఓ ఫైండర్‌గా కొనసాగనున్నట్లు సమున్నతి డైరెక్టర్ ప్రవేశ్ శర్మ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నేషనల్ అసోసియేషన్ ఫర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎన్ఏఎఫ్‌పీఓ) తో కలిసి దేశంలోనే మొట్టమొదటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారత్ ఎఫ్‌పీఓ ఫైండర్‌ను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమున్నతి డైరెక్టర్ ప్రవేశ్ శర్మ విచ్చేసి సమున్నతి సీఈఓ, వ్యవస్థాకులు అనిల్ కుమార్, వ్యవసాయ సంక్షేమ అదనపు కార్యదర్శి ఫైస్‌అహ్మద్ కిద్వాయ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ఎఫ్‌పీఓ ఫైండర్‌ను ఎఫ్‌పీఓల కోసం దేశ గూగుల్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, ఈ ప్లాట్‌ఫామ్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్నియేటివ్ అని, ఇది దేశ ఎఫ్‌పీఓలను ఒకే డిజిటల్ పై కప్పు కిందకు తీసుకువస్తుందన్నారు. భారత్ ఎఫ్‌పీఓ ఫైండర్ ప్లాట్‌ఫామ్ సలభరీతి వినియోగదారు ఇంటర్‌ఫేస్‌తో రైపొందించబడినట్లు తెలిపారు. ప్రాంతం పండించిన పంటలు అందించే సేవలు, మార్కెట్ లింకులు వంటి వివిధ ప్రమాణాల ఆధారంగా ఎఫ్‌పీఓల కొకు శోధించడానికి వినియోగదారులకు వీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ సీజీఎం డాక్టర్ ఏవి భవాని శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నారాయణరావుకు నివాళులు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 3 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తండ్రి మాధవరం నారాయణరావు జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఫామ్ హౌస్‌లో తండ్రి విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆల్విన్‌కాలనీలోని నారాయణరావు విగ్రహానికి ఎంకేఆర్ ఫౌండర్స్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధరలు తగ్గించాలని వినతి

మియాపూర్ , సెప్టెంబరు 3 : భవన వ్యర్థాలను తరలింపులో రాంకీ సంస్థ ధరలను పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెంచిన ధరలను తగ్గించాలని హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే గాంధీని మంగళవారం ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. గతంలో టన్నుకు రూ. 350 తీసుకుని వ్యర్థాలను డంప్ చేయించుకునే వారని, ఆ ధరను ఏకంగా రూ. 418 కు పెంచటంతో ట్రాక్టర్ లోడుపై రూ. 1200 భారం పడుతున్నదని, తద్వారా చిన్న చిన్న ట్రాక్టర్ నిర్వాహకులకు తీవ్ర ఆర్థిక భారం పడుతున్నదన్నారు. శ్రీనివాస్ యాదవ్, యూనియన్ ప్రతినిధులు రామకృష్ణ, చందు, బాబు, గోపాల్, మారయ్య, శేఖర్ , వేణు, మన్యం, చందు, రమేశ్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఫ్రెషర్స్‌డే

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 3 : కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని హౌసింగ్ బోర్డు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రావు, డైరెక్టర్ శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్ చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలలో విజయం సాధించి... ఉన్నతమైన ఉద్యోగాలను పొందాలన్నారు. విద్యార్థులు ఆటపాటలు...ర్యాంప్‌వాక్‌తో ఆకట్టుకున్నారు. గత ఏడాది ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఫ్రెషర్స్ డే వేడుకల ప్రారంభోత్సవంలో కరస్పాండెంట్ రవీందర్‌రావు, డైరెక్టర్ శ్రీధర్‌రావు,

కాలనీల అభివృద్ధికి కృషి

మియాపూర్ , సెప్టెంబరు 3 : డివిజన్ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. డివిజన్‌లోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం , చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ శ్రీకాంత్ కాలనీ వాసులతో మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తాగారు..మృతదేహాలుగా తేలారు

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్3: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు డ్రైనేజీ లైన్‌లో పడి ఒకరు...ఓపెన్ సెల్లార్ పడి మరొకరు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం చిన్నతడ్గూర్ గ్రామానికి చెందిన హన్మంతు(24) గత నెల 30న కొంపల్లిలోని సెంట్రల్‌పార్క్‌లోని మహాలక్ష్మి హాస్టల్‌లో ఉంటున్న తన సోదరుడి దగ్గరకు వచ్చాడు. కాగా మరుసటి రోజు హాస్టల్ నుంచి బయటకు వచ్చి కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్ పక్క లిక్కర్ మార్ట్‌లో మద్యం తాగేందుకువెళ్లాడు. మార్ట్ వెనకాలనే తవ్వకాలు చేపట్టి వదిలేసిన ఓపెన్‌సెల్లార్‌లో వర్షం నీటితో నిండి ఉంది. ఇది గమనించకుండా మద్యం మత్తులో ఉన్న హన్మంత్ మూత్రవిసర్జన కోసం వెళ్లి అందులో పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం లిక్కర్‌మార్ట్ వెనకాల ఒక యువకుడి మృతదేహం తేలి ఉందని సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్రేన్ సహాయం మృతదేహాన్ని వెలికి తీసి చూడగా హన్మంతుగా గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

డ్రైనేజీ కాల్వలో పడి...

జీడిమెట్ల విలేజ్‌లో డ్రైనేజీ కాల్వలో పడి మరో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిజామాబాద్ జిల్లా బాన్సువాడ కంసెట్‌పల్లి గ్రామానికి చెందిన మొరంగి వెంకట్ గౌడ్(48) కొన్నెండ్ల కిందట నగరానికి కుటుంబ సభ్యులతో కలిసి వలస వచ్చి జీడిమెట్ల విలేజ్‌లో ఉంటున్నాడు. కాగా వృత్తిరీత్యా కల్లుకాంపౌండ్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంపల్లిలో తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఈ నెల 1న వెంకట్‌గౌడ్ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కాగా అప్పటికే మద్యం సేవించి ఉన్నాడు. మంగళవారం ఉదయం జీడిమెట్ల విలేజ్ ప్రధాన దారికి పక్కన ఉన్న ఓపెన్ డ్రైనేజీ కాల్వలో వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు